జైలుశిక్ష నుంచి బయటపడ్డ మాజీ మంత్రి కృష్ణయ్యశెట్టి

7

పేకాట అడ్డాపై దాడి

● రూ.24 లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు

నో చాన్స్‌లర్..!

● గవర్నర్‌కు చాన్స్‌లర్ హోదా తొలగింపునకు యత్నం

● యూనివర్సిటీలపై సర్వాధికారం ముఖ్యమంత్రికే..

● బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేక బిల్లుకు సిద్ధం



గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్





ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు అన్నింటికీ చాన్స్‌లర్‌గా కొనసాగే గౌరవం దశాబ్దాలకాలంగా గవర్నర్‌కే ఉండేది. గవర్నరే నేరుగా వైస్‌చాన్స్‌లర్‌లను నియమించడం ఆనవాయితీ. ఆ తర్వాత కీలక హోదాలు, యూనివర్సిటీల సిండికేట్ సభ్యుల నియామకంలోను గవర్నర్ ముఖ్య పాత్ర పోషిస్తారు. ఈ ప్రక్రియ ఏ పార్టీకి చెందిన ప్రభుత్వమైనా అమలు చేసింది. సాధారణంగా కేంద్రంలో అధికారంలో ఉండే పార్టీకి చెందిన సీనియర్ నేతలు, భిన్నమైన రంగాల్లో అనుభవం ఉండే వివిధ రాష్ట్రాలలో కీలకహోదాలలో కొనసాగినవారిని గవర్నర్‌లుగా నియమిస్తారు. ఇదే విధానం రాష్ట్రంలోనూ అమలయ్యేది. సుదీర్ఘకాలం కేంద్రం నుంచి వచ్చిన గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వంతో పొంతన కుదిరేది కాదు. అయినా గవర్నర్ ఘనతకు ఏ ప్రభుత్వం భంగం కలిగించలేదు. రాజకీయంగా వ్యతిరేక భావనతో పలు సందర్భాలలో కొందరు విమర్శలు చేశారు. అయినంత మాత్రాన ఆయన ఘనత, గౌరవానికి ఎక్కడా తగ్గకుండానే వ్యవహరించారు. గతంలో హంసరాజ్ భరద్వాజ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సీఎం యడియూరప్ప పట్ల కక్షతో వ్యవహరించారనే విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఆ తర్వాత గుజరాత్‌కు చెందిన సీనియర్ నేత ఆర్థికమంత్రిగా ఏళ్ల తరబడి వ్యవహరించిన వాజుభాయ్‌వాలా రాష్ట్ర గవర్నర్‌గా వచ్చినప్పుడు ఇక్కడి కాంగ్రెస్, సంకీర్ణ ప్రభుత్వం కొనసాగింది. అప్పట్లోనే ఒకటి రెండు విమర్శలు వచ్చినా గవర్నర్ గౌరవాన్ని కొనసాగించారు.

గవర్నర్, ప్రభుత్వం మధ్య పెరిగిన అగాథం

ప్రస్తుతం బీజేపీ సీనియర్ నేత అయిన థావర్‌చంద్‌గెహ్లోట్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అగాథం పెరిగింది. అందుకు ప్రధాన కారణం సీఎం సిద్దరామయ్యపై ముడా ఇంటిస్థలాల అవినీతి వివాదంపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ ఆదేశించడంతోనే సమస్య తలెత్తింది. అప్పటి నుంచి ఇటు ప్రభుత్వానికి, అటు రాజ్‌భవన్‌కు మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక విశ్వవిద్యాలయాల బిల్లు 2025ను సిద్ధం చేశారు. ఈ బిల్లు ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలకు వైస్‌చాన్స్‌లర్‌లను నియమించే అధికారం ప్రభుత్వం తీసుకోనుంది. గవర్నర్ కు చాన్స్‌లర్ హోదానూ తప్పించనున్నారు. చాన్స్‌లర్ హోదా ముఖ్యమంత్రికి వరించనుంది.

యూజీసీ నిబంధనల్లో సవరణకు సిద్ధం

గవర్నర్‌కు స్నాతకోత్సవాల్లో పాల్గొనేందుకు మాత్రమే వీలుంటుంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలను సవరణ తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల ఆరు రాష్ట్రాల ఉన్నత విద్యాశాఖమంత్రుల సమావేశం బెంగళూరులో జరిగింది. ఈ సందర్భంలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సవరణ బిల్లు అంశాన్ని ప్రస్తావించింది. వైస్‌చాన్స్‌లర్‌ల నియామకంతోపాటు యూనివర్సిటీల పాలనలో రాష్ట్ర ప్రభుత్వందే పర్యవేక్షణ అనేలాంటి బిల్లును సిద్ధం చేశారు. మార్చి 3నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాలలో బిల్లును సభ ముందుకు తీసుకురాదలిచారు. కర్ణాటక రాష్ట్ర విశ్వవిద్యాలయాల చట్టం 2000 ప్రకారం వైస్‌చాన్స్‌లర్‌ల నియామకానికి ముగ్గురు సభ్యులు కల్గిన పరిశీలనా కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీ సిఫారసు అధికారాన్ని విశ్వవిద్యాలయాల చాన్స్‌లర్ హోదాలో ఉండే గవర్నర్‌కు ఉంటుంది. యూనివర్సిటీల సిండికేట్, గ్రాంట్స్ కమిషన్, గవర్నర్‌లు చెరొకరిని నియమించే అధికారం ఉంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసిన కమిటీ సభ్యుడు ముఖ్యులుగా కార్యనిర్వహణ కొనసాగిస్తారు.

పరిశీలనకు జాతీయస్థాయి కమిటీ

విశ్వవిద్యాలయాల మాజీ వైస్‌చాన్స్‌లర్‌ల శ్రేణికంటే తక్కువ కాకుండా ఉన్నత విద్యారంగంలో అనుభవం ఉన్న, పార్లమెంటు ద్వారా స్థాపించబడిన జాతీయసంస్థ లేదా సంస్థ ముఖ్యులనే పరిశీలనా కమిటీ సభ్యులుగా నియమిస్తున్నారు. కమిటీ తుది నిర్ణయం తీసుకున్న ముగ్గురి జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఆ తర్వాత రాజ్‌భవన్‌కు పంపుతారు. గవర్నర్, ప్రభుత్వ ముఖ్యులతో చర్చించి ముగ్గురిలో ఒకరిని వైస్‌చాన్స్‌లర్‌గా నియమిస్తారు.

రాష్ట్రంలో 45 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వైస్‌చాన్స్‌లర్‌ల నియామకానికి సంబంధించి అర్హులైన అభ్యర్థుల జాబితాను సంపూర్ణ వివరాలతో ప్రభుత్వానికి సమర్పించాలి. ముగ్గురిలో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల్లోగా నియామకం జరుపుతుంది. రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఉద్దేశ్యాలతో పలు యూనివర్సిటీలను కొనసాగిస్తోంది. సంబంధిత అంశంలో పరిణితి చెందిన అధ్యాపకులను, వైస్‌చాన్స్‌లర్‌లుగా నియమించదలిచారు. విజయపుర అక్క మహాదేవి, బెంగళూరులోని క్లస్టర్ యూనివర్సిటీలకు మహిళలను, కర్ణాటక జానపద యూనివర్సిటీ, కన్నడ సంస్కృత విశ్వవిద్యాలయం, గంగూబాయి హానగల్ సంగీత, కళల యూనివర్సిటీ, విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీటీయూ)లకు సంబంధింత విభాగాలలో అనుభవం ఉన్నవారికి వీసీలను నియమించదలిచారు. రాష్ట్రప్రభుత్వం గవర్నర్‌కు ఉండే కీలకమైన గౌరవాన్ని తగ్గించేందుకు కుట్ర పన్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే విషయమై ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ స్పందిస్తూ విశ్వవిద్యాలయాల బిల్లు 2025 సిద్ధమైందని, కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. శాసనసభలో ప్రవేశపెట్టదలిచామన్నారు.

3 బిల్లులను తిరస్కరించిన గవర్నర్

బెంగళూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం, రాజ్‌భవన్‌ల మధ్య వివాదం కొనసాగుతోంది. తాజాగా ప్రభుత్వం పంపిన మూడు బిల్లులను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ తిరస్కరించారు. వీటిలో సవరణలు తీసుకురావాలని గవర్నర్ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కర్ణాటక గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, విశ్వవిద్యాలయాల సవరణ బిల్లును బెళగావిలో జరిగిన శాసనసభ శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు గవర్నర్‌కు బదులు ముఖ్యమంత్రి చాన్స్‌లర్ కానున్నారు. ఇక యూనివర్సిటీలలో పాలనాపరమైన అధికారాలు, నియామకాలు ముఖ్యమంత్రికి దక్కనున్నాయి. బిల్లుద్వారా గవర్నర్ అధికారాన్ని కుదించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఇక మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారి (ముడా) 2024 బిల్లుతోపాటు కర్ణాటక ఆర్థిక సంస్థల పెట్టుబడిదారుల పరిరక్షణ బిల్లు 2024ను గవర్నర్ వాపసు పంపారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను గవర్నర్ ఇలా వాపసు పంపడం కొత్తేమీ కాదు. ఇటీవల మైక్రోఫైనాన్స్ కంపెనీల వేధింపుల నియంత్రణకు రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను తిప్పిపంపిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సవరణలు చేసి పంపిన మేరకు గవర్నర్ ఆమోదించారు.

విధానసౌధలో పని చేస్తున్నా..

● ఉద్యోగాలు ఇప్పిస్తా.. ● నకిలీ ఐడీతో పలువురికి టోకరా

● నిరుద్యోగుల నుంచి లక్షల వసూలు ● అరెస్ట్ చేసిన పోలీసులు



నిందితుడు వెంకటేశ్

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విధానసౌధలో పని చేస్తున్నా.. ఉద్యోగం కావాలా ..అంటూ నిరుద్యోగులను మోసం చేస్తున్న ఓ మోసగాడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సాక్షాత్తు సీఎం సంతకాన్ని ఫోర్జరీ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని మండ్య జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి శనివారం మీడియాకు వివరాలు తెలిపారు. విధానసౌధలో పనిచేస్తున్నానని ఉన్నతాధికారులతో సంబంధాలు ఉన్నాయని నమ్మించి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతున్న హెచ్‌సీ వెంకటేశ్‌ను అరెస్టు చేశామన్నారు. మండ్యలోని గాంధీనగర్‌కు చెందిన నేత్రావతి, కల్లహళ్ళికి చెందిన మల్లేశ్‌లకు రూ.31 లక్షలు మోసం చేశారు. నేత్రావతికి ఇద్దరు కుమారులు కాగా ఉపాధ్యాయుడు నీలకంఠాచార్ ద్వారా తావరకెరెకు చెందిన వెంకటేశ్ పరిచయం అయ్యారు. విధానసౌధలో పనిచేస్తున్నట్టు చెప్పుకొన్నారు. కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తామని బ్యాంకు ఖాతాకు రూ.15లక్షలు జమ చేయించుకున్నారన్నారు. ఆమె సొంత ఖాతాతోపాటు బంధుమిత్రుల ఖాతాల ద్వారా డబ్బు జమ చేశారన్నారు. ఆ తర్వాత విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు సంబంధించి నియామకపు పత్రాన్ని ఫోర్జరీ చేసి పంపారు. ప్రభుత్వ అదనపు కార్యదర్శితోపాటు పలువురి సంతకాలను ఫోర్జరీ చేశారు. సీఎం సిద్దరామయ్య సిఫారసు లేఖను పొందుపరిచారు. ఆ తర్వాత ఉద్యోగ నియామకం నకిలీదిగా తేలింది. ఈమేరకు మండ్య తూర్పు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అందుకు అనుగుణంగానే హెచ్‌సీ వెంకటేశ్‌ను అరెస్టు చేశామని అతడు ముగ్గురినుంచి రూ.45 లక్షలు మోసం చేసినట్లు గుర్తించామన్నారు. విధానసౌధ ఉద్యోగిగా గుర్తింపుకార్డుతోపాటు బ్యాంకు రికార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

భీమవ్వ తోలుబొమ్మలాటకు ఫిదా..!

● ప్రత్యేకంగా అభినందించిన మేఘాలయ గవర్నర్ ● ఆ రాష్ట్ర రాజ్‌భవన్‌కు రావాలని ఆహ్వానం

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):తోలుబొమ్మలాట కళల్లో అప్రతిభను కనబరిచి పద్మశ్రీ గౌరవం పొందిన మొరనాళ గ్రామానికి చెందిన భీమవ్వ దొడ్డబాళప్ప ప్రతిభను మేఘాలయ రాష్ట్ర గవర్నర్ సి.హెచ్. విజయ శంకర్ అభినందనలు తెలియజేశారు. శనివారం మేఘాలయ రాష్ట్ర గవర్నర్ శనివారం కొప్పళ జిల్లా, మొరనాళ గ్రామంలో భీమవ్వ ఇంటికి చేరుకుని కొంతసేపు తోలుబొమ్మలాట ప్రదర్శన చేయించి తన్మయం చెందారు. తొంబైఏళ్ళ పైబడిన భీమవ్వ ఎంతో ఉత్సాహంగా గవర్నర్‌కు కూర్చొన్న చోటే జానపద గీతాలు పాడుతూ చేతిలో తోలుబొమ్మలను ఆడించి ప్రదర్శనను చూసిన గవర్నర్ నిచ్చేష్టులయ్యారు. ఇదే సందర్భంలో గౌరవ ప్రదంగా గవర్నర్ హోదాలోనే భీమవ్వను సన్మానించి కానుకలు అందజేశారు. మరుగున పడిపోతున్న తోలుబొమ్మల కళాసంపదను నేటి తరాని తోలుబొమ్మలాట కళా సంపదను నేటి తరానికి అందించడం గొప్ప కార్య మన్నారు. రామాయణ మహా భారత కథలను చెప్పడం ద్వారా తోలుబొమ్మలాట కొన్ని పాటను భీమవ్వ, కొడుకు, కుమార్తెలు పాడారు. భీమవ్వతో కుటుంబ సభ్యులు కూడా ఇదే కళలను నమ్ముకుని జీవిస్తుండడం హర్షించదగ్గ విషయమన్నారు. మేఘాలయ రాజభవన్‌లో తోలుబొమ్మలాట కళాప్రదర్శను ఇచ్చేందుకు భీమవ్వ కళాబృందాన్ని ఆహ్వానించాలని గవర్నర్ ప్రత్యేక సెక్రటరీకి సూచించడం హర్షించదగ్గ విషయం. దీంతో కర్ణాటక పురాతన జానపద కళలల్లో ఒకటైన తోలుబొమ్మలాట భిన్న సంస్కృతి కలిగిన మేఘాలయ గవర్నర్‌చేత అభినందనలు అందుకోవడం.. మరోసారి కర్ణాటక పేరు జాతీయ స్థాయిలో ఎదిగిందని చెప్పవచ్చు...





తోలుబొమ్మలాట ప్రదర్శిస్తున్న భీమవ్వ, సత్కరిస్తున్న మేఘాలయ గవర్నర్ విజయ శంకర్

వచ్చే ఎన్నికలూ..

నా సారథ్యంలోనే..

● కేపీసీసీ సారథి మార్పు లేదు

● డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'వచ్చే ఎన్నికలనాటికి కూడా నేనే కేపీసీసీ అధ్యక్షుడిగా ఉంటానని' డీకే శివకుమార్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కేపీసీసీలో జరిగిన ఓ కార్యక్రమంలో డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికలు కూడా తన సారథ్యంలోనే కొనసాగుతాయన్నారు. అధ్యక్షుడి మార్పు ప్రతిపాదన ఇప్పట్లో ఎక్కడా లేదన్నారు. ఆయన వ్యాఖ్యలపై సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహొళి తీవ్రంగా స్పందించారు. త్వరలోనే కేపీసీసీ అధ్యక్షుడి మార్పు ఉంటుందన్నారు. శనివారం హుబ్బళ్ళిలో మాట్లాడుతూ ప్రస్తుతానికి ముఖ్యమంత్రి మార్పు ఉండదన్నారు. దళిత ముఖ్యమంత్రి అనేది ప్రస్తుతానికి లేదన్నారు. కానీ కేపీసీసీ అధ్యక్ష పదవికి కొత్తవారిని ఎంపిక చేస్తారనేది తెలుస్తోందన్నారు. అయితే కేపీసీసీ అధ్యక్ష పదవి కావాలని తాను కోరుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏ పదవి అయినా అధిష్టానం నిర్ణయం తీసుకోనుందన్నారు. ప్రస్తుతానికి మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు రాలేదన్నారు.

భక్త సంద్రం మధ్య ఊరేగిన

బసవేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో కొట్టూరు బసవేశ్వర స్వామి



రథోత్సవానికి హాజరైన అసంఖ్యాక భక్తులు

కంప్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బసవేశ్వరుడి రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. విజయనగర జిల్లా కొట్టూరులో వెలసిన బసవేశ్వర స్వామి రథోత్సవం లక్షలాది మంది భక్తుల మధ్య శనివారం కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామి వారికి ఊరేగింపు, పల్లకి సేవ, జలాభిషేకం, అమృతాభిషేకం, పుష్పాభిషేకం, తదితర పూజలు చేపట్టారు. రథోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రతి గ్రామం పండుగను జరుపుకుంటారు. జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ హోస్పేట నుంచి కొట్టూరుకు పాదయాత్ర చేపట్టారు. సాయంత్రం వేళ రథోత్సవం ఊరేగింపు సమయంలో దళిత మహిళ ప్రత్యేక పూజలు చేసిన అనంతరమే రథానికి వివిధ మఠాధీశ్వరులు పూజలు నిర్వహించి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని లాగారు. రాష్ట్రం నుంచే కాక ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామికి మొక్కులు సమర్పించుకున్నారు.



ఈస్ట్ నరసాపురం సమీపాన ఎండిపోయిన చీనీ చెట్టు

వామ్మో.. విల్ట్..

రైతులు లక్షల రూపాయలు వెచ్చించి, కంటికి రెప్పలా కాపాడుకున్న చీనీ చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. విల్ట్ తెగులు సోకి ఉన్నఫలంగా కాపునకు వచ్చిన చెట్లు ఎండిపోయి, మోడుగా మారిపోతున్నాయి. బిడ్డల్లా పెంచుకున్న చెట్ల దుస్థితిని చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. శింగనమల మండలంలో చీనీ విస్తారంగా సాగు చేశారు. కాపునకు వచ్చిన చెట్లను విల్ట్ తెగులు ఆశిస్తున్నాయి. దీంతో చెట్టు నిలువునా ఎండిపోతోంది. రైతులు.. ఉద్యాన శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. విల్ట్ తెగులు అంటూ కొన్ని రకాల మందులను పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. వాటిని పిచికారీ చేసినా ప్రయోజనం లేదు. ఒక్కో తోటలో 40 నుంచి 50 చీనీచెట్టు ఎండిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అన్ని చెట్లకు విల్ట్ తెలుగు వస్తే పరిస్థితి ఏంటని భయపడిపోతున్నారు. ఇప్పటికైనా ఉద్యానశాఖాధికారులు.. విల్ట్ తెగులు నివారణకు రైతులకు సరైన పరిష్కార మార్గాలు తెలపాలని కోరుతున్నారు. లేదంటే సర్వం నష్టపోతామని అన్నదాతలు వాపోతున్నారు. -శింగనమల, ఆంధ్రజ్యోతి



ఆకలి రాజ్యం పడమటి సూరీడు పండుగా మారగా.. కొమ్మ తుమ్మెదై వాలి కొరుక్కు తింటోంది..! (కూడేరు మండలం ఉదిరిపికొండ వద్ద) - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

నేడు యథాతథంగా గ్రూప్-2 పరీక్షలు

తప్పుడు ప్రచారం నమ్మొద్దు

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షల విషయంలో ఎలాంటి వదంతులు నమ్మవద్దని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గ్రూప్-2 పరీక్షల విషయంలో వాయిదా వేసినట్లు శనివారం ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఓ ప్రకటనలో అధికారికంగా స్పష్టత ఇచ్చారు. ముందుగా నిర్ణయించిన మేరకు గ్రూప్-2 పరీక్షలు 23వ తేదీ (ఆదివారం) యథాతథంగా జరుగుతాయని పేర్కొన్నారు. గ్రూప్-2 పరీక్షలు వాయిదా అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని అభ్యర్థులకు సూచించారు. ఏపీపీఎస్సీ నుంచి అందిన సమాచారం మేరకు షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. జిల్లాలో మొత్తం 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని అన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఓ ఐడెంటీ కార్డు తీసుకు రావాలన్నారు. మరోవైపు పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పర్యవేక్షించారు.

నేడు ఎక్సైజ్ అధికారుల సంఘం ఎన్నికలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారుల సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ సారి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సంఘం నాయకులు నిర్ణయించినట్లు సమాచారం.

10 టన్నుల టమోటా కొనుగోలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో 10 టన్నుల టమోటా కొనుగోలు చేశారు. శనివారం కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ ఆధ్వర్యంలో కిలో రూ.8తో పది టన్నులు కొనుగోలు చేసి విజయవాడకు పంపించారు.

చీనీ కాయలు టన్ను రూ.20వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.20,700, కనిష్ఠంగా రూ.3,100, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 110 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

28న ఉమర్ అలీషా జయంతి వేడుకలు

హాజరు కానున్న 9వ పీఠాధిపతి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం 6వ పీఠాధిపతి కవిశేఖర డాక్టర్ ఉమర్ అలీషా 140వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 28న లలితకళా పరిషత్‌లో రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమర్ అలీషా సాహితీ సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజుద్దీన్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రతియేటా పిఠాపురం, భీమవరం, బెంగుళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి వేడుకలను ఈసారి అనంతపురం జిల్లాలో నిర్వహించేలా తీర్మానించినట్లు తెలిపారు. వేడుకలకు పీఠం 9వ పీఠాధిపతి ఉమర్ అలీషా విశిష్ట అతిథిగా హాజరవడంతోపాటు 'భారతదేశం - మతసామరస్యం' అనే అంశంపై నిర్వహించే సదస్సులో ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రం

గూగూడులో సమస్యల తిష్ట

సౌకర్యాలు మృగ్యం

అభివృద్ధి ఊసేలేదు..

కలగా మారిన పర్యాటక కేంద్రం

హామీలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు



ఎస్సీ కాలనీలో డ్రైనేజీ లేక రోడ్డుపై మురుగు నీరు

నార్పల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామానికి రాయలసీమలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి దర్శనానికి రాష్ట్రం నుంచే పక్కనున్న కర్ణాటక నుంచీ సైతం భక్తులు వస్తారు. బ్రహ్మోత్సవాలకు వేలల్లో తరలివస్తారు. ప్రత్యేక బస్సులు సైతం ఏర్పాటు చేస్తారు. అంతటి ప్రసిద్ధి చెందిన గూగూడులో కనీసం మురుగు కాలువ లేదు. గ్రామస్థులు మురుగు నీటిని రోడ్లపైకి వదులుతున్నారు. ఆ నీరు ఆలయం వద్దకు చేరుతోంది. స్వామి దర్శనానికి వచ్చే భక్తాదులు ఆ మురుగు నీటిని తొక్కుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. గ్రామ వీధులు చాలా ఇరుకుగా ఉన్నాయి. వేలాదిగా భక్తులు వస్తే.. తోసుకుంటూ వెళ్లాల్సిందే. పలుమార్లు తొక్కిసలాటలు కూడా జరిగాయి. ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో గూగూడు అభివృద్ధికి ప్రజాప్రతినిధులు హామీలు గుప్పిస్తూనే ఉంటారు. ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెబుతుంటారు. తర్వాత విస్మరిస్తుంటారు. ఆలయానికి కూడా భారీగా ఆదాయం ఉన్నా.. అభివృద్ధికి ఖర్చు చేయకపోవడం పట్ల గ్రామస్థులు, భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గూగూడు కుళ్లాయిస్వామి క్షేత్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి జంట ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. అభివృద్ధి మాత్రం మచ్చుకైనా లేదు. ఏటా బ్రహ్మోత్సవాల్లో కుళ్లాయిస్వామిని ప్రజాప్రతినిధులు దర్శించుకుని, గూగూడును పర్యాటక కేంద్రం చేస్తామని హామీలు ఇస్తున్నారు. అవి మాటలకే పరిమితమవుతున్నాయి. ఎన్నోసార్లు గ్రామ ప్రజలు, భక్తాదులు అర్జీల రూపంలో కలెక్టర్లు, మంత్రులకు గూగూడును అభివృద్ధి చేయాలంటూ విన్నవించుకున్నారు. ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో గూగూడు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయింది. గ్రామంలో ఎన్నో సమస్యలు ఉన్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

భక్తులకు సౌకర్యాలు కరువు

గూగూడు కుళ్లాయిస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు స్నానాలు చేసుకోవడానికి కూడా వసతుల్లేవు. స్నానాల బావిలో చుక్క నీరు ఉండదు. భక్తాదులు నిద్ర చేయడానికి వస్తే సత్రాలు దుమ్ము, ధూళితో నిండి ఉంటాయి. ప్రతి గురువారం కుళ్లాయిస్వామి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. క్యూలైన్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో వచ్చే మహిళా భక్తులకు స్నానాలు చేయడానికి బాత్‌రూంలు లేక నానా ఇబ్బందులు పడుతుంటారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో తడికల బాత్‌రూంలు ఏర్పాటు చేస్తారు. అవి ఒక్కరోజులోనే కిందపడిపోతాయి. ఆలయం ముందు క్యూలైన్లు లేక తొక్కిసలాటలు జరిగిన సందర్భాలు కోకొల్లలు. గూగూడు గ్రామ పొలిమేర నుంచి స్వామిని దర్శించుకోవాలంటే ఇరుకు వీధుల్లో తోసుకుంటూ వెళ్లాల్సిందే. కనీసం తాగునీరు కూడా దొరకదు.



గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి జంట ఆలయాలు



గూగూడులో భక్తులు స్నానాలు ఆచరించే బావి ఇదే

గ్రామంలో అన్నీ సమస్యలే..

గూగూడు గ్రామంలో మురుగు కాలువలు కూడా లేవు. రోడ్లపైనే నీరు పారుతూ అపరిశుభ్రంగా మారాయి. గ్రామస్థులు రోడ్లపై నీటిని వదలడంతో అది కుళ్లాయిస్వామి ఆలయం వద్దకు చేరుతోంది. నిష్ఠతో వచ్చే భక్తులు.. మురుగు నీటిని తొక్కుతూ స్వామిని దర్శించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామంలో కనీసం వీధి లైట్లు కూడా లేవు. తాగునీరు కూడా దొరకదు. పంచాయితీ బోర్లలో నీరు అడుగంటిపోయింది. వచ్చే అరకొర నీటిని గ్రామం మొత్తం వాడుకుంటున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

కోటీశ్వరుడు కుళ్లాయిస్వామి

గూగూడు జంట ఆలయాలు దేవదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. స్వామికి భక్తులు సమర్పించిన డబ్బు, నగలు, వెండి గురించి తెలిస్తే నోరెళ్లబెడతారు. కుళ్లాయిస్వామికి భక్తులు సమర్పించిన డబ్బు రూ.5కోట్లు, ఒకటిన్నర టన్ను వెండి, రెండున్నర కిలోల బంగారం ఉన్నట్లు దేవదాయ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇంత డబ్బు, నగలు ఉన్నా.. ఆలయం, గూగూడు గ్రామ అభివృద్ధిని ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని, ఆలయంతోపాటు గ్రామాభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అన్నీ మోసపూరిత హామీలే



గూగూడు గ్రామస్థులకే కాదు, కుళ్లాయి స్వామికి కూడా అధికారులు, పాలకులు మోసపు హామీలు ఇస్తున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో పాలకులు, అధికారులు విఫలమయ్యారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని, పర్యాటక కేంద్రంగా గూగూడు గ్రామాన్ని మారుస్తామని పాలకులు హామీ ఇచ్చారు. అది ఎండమావిగానే మిగిలిపోతోంది. - తలారి రాజశేఖర్

దళితవాడలో అధ్వానంగా పారిశుధ్యం



దళిత వాడలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. పరిసరాలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి విపరీతంగా ఉంది. దీంతో రోగాల బారిన పడుతున్నాం. కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలి.

-అంకన్న

ప్రతిపాదనలు పంపాం



గూగూడు అభివృద్ధి కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరడం వల్ల కొత్త ఆలయం నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి త్వరలోనే చేపడతాం. అలాగే భక్తులకు ఇబ్బందులు లేకుండా కొన్ని ప్రతిపాదనలు చేశాం. వాటిని కూడా త్వరలోనే అమలు చేస్తాం.

- శోభ, ఆలయ ఈఓ

ఇంకా అదే విధానమా..?

డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరులో

పాత పద్ధతి

రైతులపై జీఎస్టీ అదనపు భారం

కొనేందుకు నిరాసక్తత.. టార్గెట్ కుదింపు



పంట పొలంలో అమర్చిన డ్రిప్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరులో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పాత సబ్సిడీ విధానాన్నే అమలు చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జీఎస్టీ అదనపు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ డీడీలు కట్టేందుకు ఎక్కువ శాతం మంది రైతులు వెనుకంజ వేస్తున్నారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పర్యటనలకు వెళ్లిన సమయంలో స్థానిక రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీని పెంచాలని కోరుతున్నారు.

టార్గెట్ కుదింపు..!

2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం జిల్లాకు భారీగానే డ్రిప్, స్ప్రింక్లర్ల టార్గెట్ విధించింది. ఉమ్మడి జిల్లాకు గతంలో అత్యధికంగా 23వేల హెక్టార్ల దాకా లక్ష్యం విధించారు. ఇందులో అనంత జిల్లా 13వేల హెక్టార్లు ఉండింది. ఈ సారి అంతకు రెట్టింపుగా 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు టార్గెట్ విధించారు. గతేడాది ఆగస్టు నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 38495 మంది రైతులు 51337 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 22752 మంది రైతులకు సంబంధించి 27698 హెక్టార్లల్లో ప్రాథమిక పరిశీలన పూర్తి చేశారు. వీరిలో 10316 మంది రైతులు 12233 హెక్టార్లకు నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించారు. ఇందులో 9699 మంది రైతులకు చెందిన 11499 హెక్టార్లకు జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారు. కాగా 7003 మంది రైతులకు సంబంధించి 8316 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు సరఫరా చేశారు. అయితే ఇప్పటి దాకా 4830 మంది రైతులకు చెందిన 5735 హెక్టార్లల్లో పరికరాలు బిగించారు. పాత సబ్సిడీ విధానంతోపాటు జీఎస్టీ అదనపు భారం నేపథ్యంలో డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డీడీలు కట్టేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏపీఎంఐపీ రాష్ట్ర ఉన్నతాధికారులు టార్గెట్‌ను 37500 హెక్టార్ల నుంచి 18వేల హెక్టార్లకు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జీఎస్టీ అదనపు భారం

పాత సబ్సిడీ విధానంలోనే డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు మంజూరుతోపాటు జీఎస్టీ అదనపు భారంగా మారింది. నాన్ సబ్సిడీపై అదనంగా 6 శాతం జీఎస్టీని విధిస్తున్నారు. దీంతో ఐదెకరాలకు పైగా పొలం ఉన్న రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నా చాలా మంది ఆసక్తి చూపడం లేదు. నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించేందుకు ఎస్టిమేషన్ వేసిన తర్వాత అదనంగా 6 శాతం జీఎస్టీ మొత్తాన్ని చూసి అంత అదనపు మొత్తం చెల్లించలేక అనేక మంది రైతులు డీడీలు కట్టకుండా మిన్నకుండిపోతున్నారు. కరువు జిల్లా రైతులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

లోకల్ డ్రిప్ పరికరాలు కొనుగోలు చేశా



నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. కూరగాయల పంటలు సాగు చేస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకున్నా. నాన్ సబ్సిడీ డబ్బులతోపాటు అదనంగా జీఎస్టీ కట్టాలని కంపెనీ సిబ్బంది చెప్పారు. అదనంగా డబ్బులు చెల్లించడం ఎందుకని బయట లోకల్ డ్రిప్ పరికరాలు కొనుకొనుగోలు చేసి వాడుకుంటున్నాం. కరువు జిల్లా రైతులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- చెన్నారెడ్డి, జంబులదిన్నె, గార్లదిన్నె మండలం

తక్కువ సబ్సిడీ, జీఎస్టీతో డ్రిప్ వద్దనుకున్నా..



5.30 ఎకరాల పొలంలో చీనీ పంట సాగు చేస్తున్నా. రైతు సేవా కేంద్రంలో డ్రిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నా. గత ప్రభుత్వం తరహాలోనే ఐదెకరాలకుపైగా పొలం ఉన్న కారణంతో 70 శాతం సబ్సిడీ మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. అందులోనూ 6 శాతం అదనంగా జీఎస్టీ కట్టాలని ఎస్టిమేషన్ వేశారు. తక్కువ సబ్సిడీతోపాటు అదనంగా జీఎస్టీ చెల్లించలేక డ్రిప్ కోసం డీడీ కట్టలేదు. నాతోపాటు మా ఊర్లో 10 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీని పెంచి రైతులందరికీ న్యాయం చేయాలి.

- రఘునాథ్‌రెడ్డి, కందుకూరు, అనంతపురం రూరల్ మండలం

లక్ష్యాన్ని తగ్గించారు



2024-25 సంవత్సరానికి డ్రిప్, స్ప్రింక్లర్ల టార్గెట్‌ను రాష్ట్ర ఉన్నతాధికారులు తగ్గించారు. తొలుత జిల్లాకు 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు కోసం లక్ష్యం విధించారు. ఇటీవల 18వేల హెక్టార్లకు లక్ష్యాన్ని తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డీడీలు చెల్లించిన రైతులకు జిల్లా కలెక్టర్ మంజూరు ఉత్తర్వుల మేరకు సకాలంలో పరికరాలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. సబ్సిడీ పెంపు ప్రభుత్వం చేతుల్లోనే ఉంది.

- రఘునాథరెడ్డి, పీడీ, ఏపీఎంఐపీ

పారిశ్రామికవేత్తలుగా డ్వాక్రా మహిళలు

జీవనోపాధుల పెంపునకు ప్రణాళికలు

స్వయం సహాయక సంఘాలకు ఇతోధికంగా రుణాలు

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య



పథకాలపై సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగా వారిని ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తీసుకువచ్చిన స్వయం ఉపాధి పథకాలపై శనివారం తన చాంబర్‌లో శాఖ అధికారులతో పీడీ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాల (డ్వాక్రా)కు ప్రవేశపెట్టిన జీవనోపాధుల పెంపు పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాల్లో కనీసం రెండు వేల మందిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడమే లక్ష్యం అన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే సీఎం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రధానంగా ఎస్టీ కార్పొరేషన్ నిధులతో ఆ వర్గ మహిళలకు పెరటికోళ్ల పెంపకం అమలు చేస్తున్నామని, 31 మండలాల్లో 869 మందిని గుర్తించి రూ.47.16 లక్షలు చెల్లించామని అన్నారు. ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా ఎస్సీ డ్వాక్రా మహిళలకు రూ.50వేల సబ్సిడీ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 31 మండలాల నుంచి 68 మందిని గుర్తించామని, వీరికి రూ.1.06 కోట్లు నిధులు మంజూరు చేశామని అన్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు త్వరలో చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద డ్వాక్రా మహిళలకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా హోంకంపోస్టింగ్, కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 12,569 మందిని గుర్తించామన్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణాభివృద్ధిశాఖ (సెర్ప్) ద్వారా స్వీప్ ప్రాజెక్ట్‌ను శింగనమల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నాలుగేళ్లపాటు ఈ పథకం అమలు చేస్తామన్నారు. ఏడాదికి ఒక్కో మండలంలో 25 మంది చొప్పున 150 మందిని, నాలుగేళ్లలో 600 మందికి పైగా డ్వాక్రా మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ పథకాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకుని, జీవనోపాధుల పెంపుతో పేదరికం నుంచి విముక్తి పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు గంగాధర్, సత్యనారాయణ, రవీంద్రబాబు, ఏపీఎంలు భాస్కర్‌నాయుడు, మంజుల పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

స్టాన్ లారెల్ (వర్ధంతి)



స్టాన్ లారెల్ 1890 జూన్ 16న ఇంగ్లండ్ దేశం లాంక్‌షైర్‌లో జన్మించారు. ఒలివర్ హార్డీ, లారెల్‌ల ద్వయం సినీరంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. 50కుపైగా సినిమాలలో నటించారు. క్లాజికల్ హాలీవుడ్ కాలంలో ఇద్దరూ కలసి 107 సినిమాలు, 32 షార్ట్ సైలెంట్ ఫిల్మ్స్, 40 షార్ట్ సౌండ్ ఫిల్మ్‌లో నటించారు. నాటక రంగంలోనూ, బుల్లితెర పైనా సత్తాచాటుకున్నారు. 1965 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి (వర్ధంతి)



'కళాప్రపూర్ణ' పురస్కార గ్రహీత మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గుంటూరు జిల్లా లింగాయపాలెంలో 1914 జూలై 7న జన్మించారు. గాంధీజీ పిలుపుతో 15ఏళ్ల ప్రాయంలోనే స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టారు. కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొని జైలుశిక్షకు గురయ్యారు. స్వాతంత్ర్యానంతరం నిజాం నవాబుకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలోనూ పాల్గొన్నారు. మిత్రుడు కేఎస్ ప్రకాశరావు ప్రోత్సాహంతో సినీరంగంలో అడుగుపెట్టారు. ఆరు అడుగుల ఆజానుబాహుడు, ఖంగున మోగే కంఠస్వరం, సువిశాల ఫాలభాగం వంటివి సినీరంగంలో రాణించేందుకు దోహదపడ్డాయి. ప్రధానంగా ఎన్టీఆర్‌తో కలసి దాదాపు 150 చిత్రాల్లో నటించారు. పౌరాణిక చిత్రాలు మిక్కిలినేనికి ఎంతో పేరు తెచ్చాయి. సినిమాల్లో నటిస్తున్నా తన ఉన్నతికి కారణమైన నాటక, జానపద కళారంగాన్ని విస్మరించలేదు. రాష్ట్రప్రభుత్వం నుంచి 'ఎన్టీఆర్ ఆత్మగౌరవ' పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు. 2011 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

జైలు శిక్ష నుంచి మాజీ మంత్రి కృష్ణయ్యశెట్టికి ఉపశమనం

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ రికార్డులతో ఎస్‌బీఎంలో రూ.7.17 కోట్లు రుణం తీసుకుని మోసం చేశారనే ఆరోపణపై మాజీ మంత్రి కృష్ణయ్యశెట్టికి విధించిన జైలుశిక్ష నుంచి ఉపశమనం లభించింది. ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం ఈనెల 6న తీర్పును ప్రకటించింది. మూడేళ్ల జైలు శిక్షను విధించింది. ఈమేరకు కృష్ణయ్యశెట్టి ప్రజా ప్రతినిధుల కోర్టు తీర్పును రద్దు చేయాలని హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈమేరకు న్యాయమూర్తి ఎం నాగప్రసన్న ఏకసభ్య ధర్మాసనం శుక్రవారం జైలుశిక్ష తీర్పును పెండింగ్‌లో ఉంచారు. దీంతో కృష్ణయ్యశెట్టికి ఉపశమనం లభించినట్టయ్యింది. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ మైసూరు నుంచి కృష్ణయ్యశెట్టి తోపాటు బాలాజి కృపా ఎంటర్‌ప్రైజెస్ ద్వారా రూ.7.17 కోట్ల రుణం పొందారు. ఇందుకుగాను నకిలీ రికార్డులు సమర్పించారనే వివాదంతో కృష్ణయ్యశెట్టి సహా నలుగురిపై ప్రజాప్రతినిధులకోర్టు శిక్షను ఖరారుచేసింది. ఒక్కొక్కరికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.21.5లక్షల జరిమానా విధించారు. తీర్పును హైకోర్టు పెండింగ్‌లో ఉంచారు. వారు చేసిన డిపాజిట్లను డ్రా చేసుకునేందుకు వీలు లేకుండా ఆంక్షలు విధించారు. 1993లో బాలాజికృప ఎంటర్‌ప్రైజెస్ యజమానిగా ఉన్నవేళ బీటీఎస్, కేఎస్ఆర్టీసీ, బీఎస్ఎన్ఎల్‌తోపాటు ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేసే 181మంది ఉద్యోగులకు ఇంటి రుణాలు ఇప్పిస్తామని బ్యాంకు నుంచి తీసుకున్న రుణం తిరిగి చెల్లించకపోవడంతో కేసు నమోదైంది.

కావేరిలో అత్యాధునిక చికిత్సా కేంద్రం

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మారిన సాంకేతికతకు అనుగుణంగా వైద్యరంగంలోనూ ఏఐ టెక్నాలజీతో కూడి గుండె చికిత్సా కేంద్రాన్ని కావేరి ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. వార్షిక హృదయ సమ్మేళనం 2025లో భాగంగా కొత్త విభాగాన్ని కల్పించినట్టు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. రెండు రోజులపాటు జరిగిన సమ్మేళనంలో దేశ విదేశాలకు జరిగిన 35మంది హృద్రోగ నిపుణులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దేశంలో ఏడాదికి 80 లక్షలమంది హృదయ విఫలం కేసులు నమోదవుతున్నట్టు నివేదికల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం రోబోటిక్, కృత్రిమ మేధ వంటివి అందుబాటులో ఉండడంతో వాటిని సద్వినియోగం చేసుకునేలా చికిత్సా విధానాలు అమలు చేస్తున్నామని ఆసుపత్రి ఈడీ డాక్టర్ ఎస్ విజయభాస్కరన్ తెలిపారు.

కొనసాగిన యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): లోకసంరక్షణ, విశ్వశాంతి కోసం చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞం 9వ రోజు శనివారం కొనసాగింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో 110 మంది వేదపండితులు 11 హోమాల్లో యజ్ఞం నిర్వహించారు. మహాగణపతిపూజతో మొదలుపెట్టి లింగార్చనం, అభిషేకాలు, విష్ణుసాహస్ర నామం, గాయత్రి, అన్నపూర్ణ, లక్ష్మీ, సర్వదేవతార్చనతో కొనసాగించారు. సాయంత్రం రక్షిత,రాంజీ బృందం సంగీత గాన కచేరిని నిర్వహించారు.

హులిబెలెలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి తాళం

- ప్రారంభానికి నోచుకోని నూతన భవనం
- ఆరు నెలలుగా వైద్య సిబ్బంది కొరత



తాళం వేసిన పాత ఆరోగ్య కేంద్రం



హులిబెలెలో నిర్మించిన నూతన భవనం

బంగారపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హులిబెలె ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రంలో ఆరు నెలలుగా వైద్యులు, నర్సులు ఇతర సిబ్బంది లేక మూతపడింది. ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రంలో వైద్యుల పోస్టులు ఖాళీ ఉన్నా కనీసంగా నియమించడంలో పాలకులు, అధికారులు దృష్టి సారించలేదనే విమర్శలు ఉన్నాయి. హులిబెలె గ్రామం హోబళి కేంద్రంగా ఉంది. ప్రత్యేకించి రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితుల వేళల్లో చికిత్స అవసరమైతే ప్రైవేట్ ఆసుపత్రులే శరణ్యంగా ఉంది. తాలూకాలోని గ్రామీణ ప్రాంతాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరిస్థితి ఇలాగే ఉంది. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన వైద్యులు వారానికి రెండుమూడు సార్లు మాత్రమే అందుబాటులో ఉండేవారు. కాగా ఇదివరకు ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం చిన్నదిగా ఉండడంతో కొత్త భవనం నిర్మించి సదుపాయాలు కల్పించారు. ఆరు నెలలక్రితమే కొత్త భవనం అందుబాటులోకి తెచ్చినా ఇంతవరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఆరు నెలలుగా వైద్యులు, ఇతర సిబ్బంది లేక పాత భవనానికి తాళం వేశారు. హులిబెలెలో ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రం ఉన్నా సిబ్బంది కొరత కారణంగా నెలల తరబడి చికిత్సలు అందడం లేదు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పేరుకు మాత్రమే కొత్తది..



వీణా వెంకటేశ్

హులిబెలెలో పేరుకు మాత్రమే ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రం ఉందని అయితే ఎలాంటి వైద్యులు, నర్సులు లేవని పీఎల్‌డీ బ్యాంకు డైరెక్టర్ వీణా వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. ప్రతిరోజూ పట్టణ ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారన్నారు. ఇకనైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి వైద్యులు, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.

నూతన భవనం ప్రారంభం ఎన్నడో...



పుట్టరాజు

హులిబెలె గ్రామానికి పాత ఆరోగ్య ఉపకేంద్రం ఉన్నప్పుడు వారానికి రెండుసార్లు వైద్యులు వచ్చేవారని గ్రామస్థుడు పుట్టరాజు అభిప్రాయ పడ్డారు. కొత్త భవనం నిర్మించి నెలలు గడిచినా ప్రారంభానికి నోచుకోలేదని విచారం వ్యక్తం చేశారు. నూతన భవనంలో సదుపాయాలు కల్పించామని అధికారుల ద్వారా తెలుస్తున్నా ఇంతవరకు ప్రారం భానికి నోచుకోలేదని వాపోయారు. పేరుకు మాత్రమే మాదిరి ఉపకేంద్రంగా ఉందని ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలయానికి మరింత గుర్తింపు తెస్తాం

- 10 కిలోల బియ్యం ఇస్తాం : మంత్రి మునియప్ప



ప్రసంగిస్తున్న మంత్రి మునియప్ప



ఆదిజాంభవంత స్వామికి అలంకరణ

ముళబాగిలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఆవణి గ్రామంలో నెలవైన ఆదిజాంబవంత ఆలయ ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కల్యాణమండపాన్ని నిర్మించి మరింత గుర్తింపు తెస్తామని పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప తెలిపారు. ఆవణి జాతరను పురస్కరించుకుని ఏర్పాటైన తొలిపూజా కార్యక్రమంలో పాల్గొని మాటాడారు. అన్నివర్గాల ప్రజల పెళ్లిళ్లకు వీలుగా కల్యాణమండపం నిర్మించేందుకు తీర్మానించామన్నారు. దేవాలయ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం ఇస్తామన్నారు. రాష్ట్ర మాదిగదండోరా రాష్ట్ర అధ్యక్షుడు ఎం శంకరప్ప మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో ప్రగతి సాధ్యమని అభిప్రాయపడ్డారు. మాతంగ మునికుల గురువు ఆనందమునిస్వామిజీ, ఆదిజాంభవ మఠం సేవాట్రస్టు ఆధ్వర్యంలో దేవుడి ఊరేగింపు జరిగింది. ఉదయం పుణ్యాహవచనం, పంచగవ్య, గణపతిహోమం, జాంబవంత హోమం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, మంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు అశ్వత్థ నారాయణ బృందంచే ధార్మిక కార్య క్రమాలు శాస్త్రోక్తంగా కొన సాగాయి. ఉత్సవాల్లో తహశీల్దార్ వీ గీతా, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీప్రియ, కాంగ్రెస్ ప్రముఖుడు జీ రామలింగారెడ్డి, ప్రసాదబాబు, కార్గిల్ వెంకటేశ్, రాజు, డాక్టర్ మహేశ్, కగ్గినహళ్ళి శ్రీనివాస్, జయదేవ్, ఆలయ అభివృద్ధి సేవా ట్రస్టు అధ్యక్షుడు బీఏ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

10 కిలోల బియ్యం ఇస్తాం

అన్నభాగ్య పథకం కింద అన్ని కంతుల మొత్తం విడుదల అయ్యిందని, ఫిబ్రవరి నెల 10కేజీల బియ్యం చేరి వచ్చే నెల బియ్యం ఇవ్వనున్నట్టు మంత్రి మునియప్ప వెల్లడించారు. బియ్యం ఇచ్చేందుకు రాష్ట్రంలో నిధుల కొరత లేదన్నారు. తొలుత బియ్యం సమకూర్చేందుకు కేంద్రం అంగీకరించకపోవడంతో అందుకే నగదు ఇచ్చామన్నారు. ప్రస్తుతం బియ్యం ఇచ్చేందుకు కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి అంగీకారం తెలిపారన్నారు. 2.10 లక్షల మెట్రిక్ టన్ను బియ్యం ప్రతి నెలా అవసరమన్నారు. రాష్ట్రంలో సుమారు 4 కోట్లమందికి బియ్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కాగా గృహలక్ష్మి పథకానికి సంబంధించిన మొత్తాన్ని విడతలవారీగా ఇవ్వనున్నట్టు తెలిపారు. కోలారు డీసీసీ బ్యాంకు ఎన్నికల్లో జాప్యంపై విచారం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. కోర్టులో కేసు ముగిశాకనే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

శివరాత్రికి ఆదియోగి శివుడి నమూనా



మీడియా సమావేశంలో సీకల్ ఆనందగౌడ తదితరులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆర్‌సీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న ఆదియోగి శివుడి రూపంలో శిడ్లఘట్టలో ఏర్పాటు చేయనున్నట్టు శిడ్లఘట్ట బీజేపీ రూరల్ హోబళి అధ్యక్షుడు సీకల్ ఆనందగౌడ వెల్లడించారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో సంఘం అనుబంధ సంస్థలు, సాంస్కృతిక కళాబృందాలతో సన్నాహకసభ నిర్వహించారు. విగ్రహం ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సనాతన ధర్మానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని ఒక పండుగలా ఆచరిస్తారన్నారు. చిక్కబళ్ళాపురలోని ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆదియోగి శివుడి ప్రతిరూపం తరహాలో శిడ్లఘట్ట పట్టణంలోని కోటె సర్కిల్‌లో ఏర్పాటు చేయదలిచినట్టు తెలిపారు. శివరాత్రి రోజున భక్తులకు దర్శనం, జాగరణ, వ్రతం, భజన ఇతర ధార్మిక కార్యక్రమాలకు వీలుగా సదుపాయాలు కల్పిస్తామన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ విభాగం అధ్యక్షుడు నరేశ్, నగర సభ సభ్యుడు నారాయణస్వామి, మోహన్, అశ్వథ్, జగదీశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హులిబెలె పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా నారాయణస్వామి



నూతన డైరెక్టర్లకు సన్మానం

బంగారపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హులిబెలె పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం పాలకమండలిగా నూతన అధ్యక్షులుగా హెచ్‌కే నారాయణస్వామి, ఉపాధ్యక్షులుగా గోవింద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు శనివారం ఎన్నికల ప్రక్రియ జరిగింది. మొత్తం 12 డైరెక్టర్ స్థానాలు కల్గిన సంఘంలో అధ్యక్ష స్థానానికి హెచ్‌కే నారాయణస్వామి, ఉపాధ్యక్ష స్థానానికి గోవింద మాత్రమే నామినేషన్ సమర్పించారు. ఇతరులెవ్వరూ నామినేషన్ వేయకపోవడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి బాలకృష్ణ ప్రకటించారు. నూతన అధ్యక్షుడు హెచ్‌కే నారాయణస్వామి మాట్లాడుతూ డైరెక్టర్లు, గ్రామపెద్దల సహకారంతో వరుసగా ఐదోసారి అధ్యక్షుడు అయ్యానని అందరికీ కృతజ్ఞత తెల్పుతున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి, కోచిముల్ మాజీ డైరెక్టర్ జై సింహకృష్ణ సహ కారంతో పాల ఉత్పత్తిదారుల సహకారసంఘాన్ని అభివృద్ధి చేశామన్నారు. రానున్న రోజుల్లో మరింత పురోగతికి పాటుపడతామన్నారు. ఈ సందర్భంగా పీఎల్‌డీ బ్యాంకు డైరెక్టర్‌లు వీణా వెంకటేశ్, వీఎస్ఎస్ఎన్ డైరెక్టర్ మంజు, రామకృష్ణ, శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ప్రకాశ్‌గౌడ, పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం డైరెక్టర్‌లు బలరామ్, ఆర్ గోవిందప్ప, పుట్టరాజు, మునిరాజు, కళావతి, వెంకటేశ్, శీనప్ప, రామక్క తదితరులు పాల్గొన్నారు.

పగలు.. రాత్రి బిజీ బిజీ..!

- అంతర్రాష్ట్ర దొంగ కథే వేరు
- 350 గ్రాముల బంగారం బిస్కట్ స్వాధీనం



రికవరీ చేసిన బంగారం, ఆభరణాలను కరిగించే యంత్రాలను చూపుతున్న సీఐ రాఘవన్

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలను ఉదయం చోరీలు చేసి.. రాత్రిళ్ల కరిగించి బిస్కెట్‌గా మార్చి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర దొంగ సుహైల్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 350 గ్రాముల బంగారం బిస్కెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండ సర్కిల్ కార్యాలయంలో సీఐ రాఘవన్ ఈ కేసు వివరాలను శనివారం వెల్లడించారు. పెనుకొండ నారాయణమ్మ కాలనీలో ఉపాధ్యాయుల ఇళ్లలో జనవరి 20న సుహైల్ ఖాన్ చొరబడి, 470 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ చేశాడని సీఐ తెలిపారు. బెంగళూరుకు చెందిన సుహైల్ చోరీ చేసినట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించామని, తుమకూరులో శివానగర్‌లో ఈ నెల 13న అరెస్టు చేశామని తెలిపారు. రిమాండ్‌కు తరలించిన అనంతరం కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారించామని తెలిపారు. నిందితుడు చోరీ చేసిన బంగారాన్ని కరిగించేందుకు ఆన్‌లైన్‌లో పరికరాలను కొనుగోలు చేశాడని అన్నారు. బిస్కెట్ బంగారాన్ని హైదరాబాద్‌లోని ఓ దుకాణంలో విక్రయించాడని తెలిపారు. అక్కడ రికవరీ చేశామని తెలిపారు. బంగారాన్ని కరిగించే యంత్రాలు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. మొత్తం 350 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశామని, ఇందులో 250 గ్రాములు పెనుకొండలో చోరీ చేసినదని, మిగిలిన సొమ్ము కుప్పంలో రెండు చోట్ల చోరీ చేసినదని తెలిపారు. హైదరాబాద్ బంగారం వ్యాపారి కూడా మోసపోయాడని, బంగారం కొని సుహైల్‌కు రూ.29 లక్షలు ఇచ్చాడని తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఎస్ఐ రాము, ఎస్ఐలు రాజేష్, వెంకటేశ్వర్లు, అంజినేయులు, కానిస్టేబుల్ ఆదినారాయణ, నాగరాజు, సుధాకర్, దస్తగిరి, రామును ఎస్పీ రత్న అభినందించారని సీఐ తెలిపారు. సుహైల్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో పలు కేసులున్నాయని, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అని తెలిపారు.

వీ గ్రూప్ ద్వారా గోల్ఫ్ పోటీలు

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వీ గ్రూప్ సంస్థ, రోటరీ బెంగళూరు ఐటీ కారిడార్ సహకారంతో ప్రమోషన్ గోల్ఫ్ చాంపియన్‌షిప్ 2025ను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. వీ గ్రూప్ డైరెక్టర్ వెంకటేశ్ ఈమేరకు మీడియాకు వివరాలు తెలిపారు. ఏప్రిల్‌లో పోటీలు జరగనున్నాయన్నారు. కుమారకృప ఎదురుగా ఉండే గోల్ఫ్‌క్లబ్‌లో పోటీలు జరుగుతాయని, దేశ వ్యాప్తంగా ఆసక్తికల్గినవారంతా భాగస్వాములు కానున్నారన్నారు. గుర్తింపు పొందిన క్లబ్‌లలో సభ్యత్వం ఉన్నవారు పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చునన్నారు.

ఎలక్ట్రికల్ వాహనాలకు పెరుగుతున్న ఆదరణ

- ఆటో ఎక్స్‌పోను ప్రారంభించిన పీఈఎస్ ప్రో-చాన్స్‌లర్



ఆటోఎక్స్‌పోను ప్రారంభిస్తున్న పీఈఎస్ ప్రో-చాన్స్‌లర్ జవహర్

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ వాహనాలకు ఆదరణ పెరుగుతోందని పర్యావరణానికి శుభపరిణామమని పీఈఎస్ యూనివర్సిటీ ప్రో-చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. పీఈఎస్ హనుమంతనగర్ క్యాంపస్‌లో పాలిటెక్నిక్ విభాగం ఆధ్వర్యంలో ఆటో ఎక్స్‌పో 2025ను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ ఆటోమొబైల్ రంగంలో బ్యాటరీ ఆధారిత కార్లు భవిష్యత్తుకు బాటలు వేయనున్నాయన్నారు. పెట్రోల్, డీజిల్ నుంచి జరుగుతున్న దుష్పరిణామాలు తగ్గనున్నాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలక్ట్రికల్ వాహనాలు వాడడం ద్వారా వాయుకాలుష్య నియంత్రణకు సహకారం కానుంద న్నారు. పీఈఎస్ ఉద్యోగులు ఎలక్ట్రికల్ వాహనాలు కొనుగోలు చేస్తే యూనివర్సిటీ నుంచి రుణసాయం చేస్తామని ప్రకటించారు. వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ సూర్యప్రసాద్, హనుమంతనగర్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వీ సత్యనారాయణ; కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో శిక్షణ కోసం ఒప్పందం



ఒప్పందంలో ఇరుసంస్థల ముఖ్యులు

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లభాషలో నైపుణ్యతను విద్యార్థులకు అందించాలనే ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌తో ఒప్పందం చేసుకుంది. స్పెషలైజ్డ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రోగ్రామ్ అమలు చేయదలిచినట్టు ఆర్కిడ్స్ చీఫ్ అకడమిక్ ఆఫీసర్ నరేశ్ రామమూర్తి ప్రకటించారు. విద్యార్థులకు అంతర్జాతీయస్థాయిలో భాషా పరిజ్ఞానం ప్రస్తుత ఆధునిక యుగంలో అవసరంగా మారిందన్నారు. అందుకే యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. దేశవ్యాప్తంగా 25 ప్రధాన నగరాలలో 90 శాఖలు కలిగి ఉన్నామని అందరి విద్యార్థులకు ఇది అనుకూలం కానుందన్నారు.

భక్తులకు గంగాజలం పంపిణీ



గంగాజలం క్యాన్లు అందిస్తున్న మాజీమంత్రి కృష్ణయ్యశెట్టి

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి నేపథ్యంలో నగరంలోని శివాలయాలకు గంగాజలాన్ని మాజీ మంత్రి కృష్ణయ్యశెట్టి అందచేశారు. చిక్కపేటలోని కాశీవిశ్వనాథ ఆలయంలో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో త్రివేణి సంగమం నుంచి తెప్పించిన గంగాజలాన్ని అర్చకబృందానికి కళశాల ద్వారా ఇచ్చారు. ఈ సందర్భంగా శివాలయంలో విశేషపూజలు నిర్వహించారు. కాగా శివరాత్రిలోగా నగరంలోని ఇతర ప్రముఖ ఆలయాలకు గంగాజలం సమకూర్చనున్నట్టు మాజీ మంత్రి కృష్ణయ్యశెట్టి తెలిపారు.

సుఖమయ నిద్రతోనే ఆరోగ్యం

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సుఖమయ నిద్రతోనే ఆరోగ్యం సాధ్యమని పెప్స్ ఇండస్ట్రీస్ కో-ఫౌండర్ శంకరరామ్ అభిప్రాయపడ్డారు. నగరంలో శనివారం పెప్స్ సంస్థ నాలుగు కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేశారు. పెప్స్ కంఫర్ట్, పెప్స్ సుప్రీం, పెప్స్ రెస్టోని, మొమరి ఫోం అనే నాలుగు బ్రాండ్లను విడుదల చేశారు. కంపెనీ ముఖ్యులతో పాటు వినియోగదారులు భాగస్వామ్యులయ్యారు.

దొమ్మసంద్రలో పాత్రికేయుడిపై దాడి

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ జిల్లా ఆనేకల్ తాలూకా దొమ్మసంద్రలో పాత్రికేయుడు మునియప్పపై గ్రామ సహాయకుడు రవి, అతడి అనుచరులు దాడి చేశారు. ఇటీవల గ్రామ సహాయకుడిపై ఆరోపణలు వచ్చిన మేరకు కథనం చేసేందుకు వెళ్లిన సమయంలోనే దాడి జరిగింది. మునియప్పపై దాడిని స్థానిక పాత్రికేయులు, వివిధ పత్రికల పంపిణీదారులు తీవ్రంగా ఖండించారు. వెంటనే గ్రామసహాయకుడిపై చర్యలు తీసుకోని పక్షంలో ఆనేకల్ తాలూకా వ్యాప్తంగా దినపత్రికల పంపిణీని నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

పేకాట అడ్డాపై దాడి

బెంగళూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దావణగెరె పట్టణం డెంటల్ కళాశాల రోడ్డు సమీపాన మ్యాంగో హోటల్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సీఈఎన్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అందర్ బాహర్ ఆడుతున్నారని గుర్తించి రూ.24.86 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న 26మందిని అరెస్టు చేశారు. దావణగెరె ఎస్పీ ఉమా ప్రశాంత్ మార్గదర్శకంలో సీఈఎన్ డీఎస్పీ పద్మశ్రీ గుంజికర్ నేతృత్వంలో ఎస్సై సునీల్ తేలి, సిబ్బంది శుక్రవారం కార్యాచరణ నిర్వహించారు. ఎక్కడైనా పేకాట ఆడితే కఠినచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

కల్లూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యంపై శనివారం కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలు... అనంతపురం జిల్లాకు చెందిన తనూజ (19) ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. ఈనెల 13వ తేదీన కళాశాల నుండి విద్యార్థిని తన తండ్రితో ఫోన్‌లో మాట్లాడిందన్నారు. అదే రోజు సాయంత్రం ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆమె తండ్రి కళాశాలకు వచ్చి విచారించగా అక్కడ కనిపించలేదు. దీంతో చుట్టుప్రక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో అదృశ్యమైనట్లు గుర్తించి అమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1609.87	1,587.55
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,104	507
నీటి నిల్వ (టీఎంసీలు)	37.31	9.11

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

● నారాయణ కళాశాల ప్రిన్సిపాల్ రజని



నమూనాతో విద్యార్థినులు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే నారాయణ పాఠశాల లక్ష్యమని నారాయణకాలేజీ ప్రిన్సిపల్ రజని అన్నారు. శనివారం పాఠశాల అడడమిక్ ఫేర్ ప్రారంభోత్సవంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చి దిద్దుతున్నామన్నారు. ఈఫేర్‌లో పాఠశాల కిడ్స్ విభాగం, చాంప్స్ విభాగం,ఈ-టెక్నో విభాగంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 200 కు పైబడి వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించారు. భౌతవిజ్ఞాన, రసాయన శాస్త్ర, జీవశాస్త్ర, కన్నడ, హిందీ, సమాజ విజ్ఞాన , రోబోటిక్ విషయాలపై విద్యార్థులు ప్రదర్శించిన మోడల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా కాలేజీ ఏజీఎం.లవణ కుమార్‌రెడ్డి, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి సుష్మా, అడడమిక్ డీన్ మహేశ్ బాబు, కిడ్స్ విభాగం సుప్రియా, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బళ్లారిలో ఎండు మిరప మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి

మంత్రికి చాంబర్ ఆఫ్ కామర్స్ వినతి

బళ్లారి సిటీ. ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎండ మిరప మార్కెట్ యార్డును త్వరగా ప్రారంభించాలని బళ్లారి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, ఇతర సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం హుబ్బళిలో వారు వ్యవసాయ మార్కెట్ యార్డు మంత్రి శివానంద పాటిల్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో మంత్రి బళ్లారి పర్యటనలో ఇచ్చిన మాటను నిలుపుకోవాలని వీరు కోరారు. వీరితో పాటు కమిటీ సభ్యులు ఉన్నారు.

బియ్యం గోడౌన్ల పరిశీలన

సిరుగుప్ప, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆహార పౌరసరఫరా అధికారులపై కర్ణాటక రాష్ట్రం ఆహార పౌరసరఫరాల నిగమ అధ్యక్షుడుడాక్టర్ క్రిష్ణప్ప విరుచుపడ్డారు. శనివారం సిరుగుప్ప పట్టణం ఏపీఎంసీ ఆవరణంలో ఆహార పౌరసరఫరాల గోడౌన్‌ను ఆయన పరిశీలించారు. నిల్వ వున్న సబ్సిడీ బియ్యాన్ని పరిశీలించారు. గోడౌన్‌లో విద్యుత్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో గోడౌన్ మేనేజర్ చలవరాయస్వామి, ఇన్స్‌పెక్టర్ మహారుద్రగౌడపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైందికాదని ఆయన సూచించారు. ఫిబ్రవరి నెల నుంచే రేషన్ లబ్దిదారులకు ఒకరికి పది కిలోల బియ్యం అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార పౌరసరఫరాల నిగమ సదస్యురాలు రోహిణి, మేనేజర్ చలవరాయస్వామి, ఇన్స్‌పెక్టర్ మహారుద్రగౌడ తదితరులు వున్నారు.

పర్యాటక శాఖలో పెట్టుబడులపై పరిశీలన

● హంపిలో పర్యటించిన విదేశీ బృందం ● రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొనసాగనున్న పర్యటన

బళ్లారి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖలో పెట్టుబడుల సాధ్యాసాధ్యాలపై విదేశీ బృందం పరిశీలించింది. ప్రపంచ పర్యాటక కేంద్రాల్లో ఒకటైన హంపిని 19 దేశాలకు చెందిన విదేశీపెట్టుబడిదారులు, ఇద్దరు స్వదేశీపెట్టుబడిదారులతో కలిసి శనివారం పర్యటించారు. కర్ణాటక ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎక్స్ పో (కేఐటీఈ) 2025 ప్రణాళికలో భాగంగా వారు ఈ పర్యటన సాగించారు. ఆస్ట్రేలియా. రష్యా, అమెరికా, మలేషియా, ఫిలిప్పీన్స్, శ్రీలంక, బెల్జియం, ఇటలీ, అర్జెంటీనా, తదితర విదేశాల బృందం ఇందులో ఉన్నారు. హంపిలోని విరుపాక్షేశ్వర ఆలయం , విజయ విఠల్ ఆలయం, రాతి రథం, సంగీత మందిరం, కమల్ మహల్, గజశాల, క్వీన్స్ బాత్ హౌస్, తుంగభద్రలోని చక్రతీర్థ, కోదండరామ ఆలయం, తులాభారం ప్రాంతాలను వారు సందర్శించారు. ఇండియన్ కరెన్సీ రూ. 50 నోటు పై ఉన్న హంపి రాతిరథాన్ని చూసి వారు అబ్బురపోయారు. విజయపుర, బాదామి, పట్టడకల్లు, ఐహోలే. లక్కుండి, మైసూర్ ప్యాలెస్, వన్యప్రాణుల అభయారణ్యాలు, కొండ తదితర ప్రాంతాలనూ ఈ బృందం పర్యటిస్తుందని టూరిజం డిపార్ట్‌మెంట్ డీడీ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం తరువాత ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ పర్యటించి 25న తిరిగి హంపికి బృందం చేరుకోనున్నారు.

రాతిరథం వద్ద విదేశీ బృందం



మరిన్ని ప్రాంతాల్లో పర్యటన..

రాష్ట్రంలోని అనేక టూరిజం ప్రాంతాల్లో పర్యటించనున్న స్వదేశీ, విదేశీ పర్యాటక బృందం పెట్టుబడులపై అధ్యయనం చేయనున్నట్లు డీడీ తెలిపారు. సంస్కృతి, వారసత్వం,పర్యావరణ అనుకూలం, పర్యాటక అవకాశాలు, సదుపాయాలు, తదితర అంశాల పై చర్చించి పెట్టుబడులు పెట్టేందుకు విదేశీపర్యాటక శాఖ ముందుకొచ్చారని ఆయన అన్నారు.



శ్రీశైలానికి బయలుదేరిన మాలధారులు

కాలినడకన శ్రీశైలానికి..

కంప్లి, ఫిబ్రవరి 22(ఆంధ్ర జ్యోతి) : సన్నాపురం గ్రామంలో శనివారం శివమాలధారులు శ్రీశైలానికి పాదయాత్రగా బయల్దేరారు.స్థానిక వీరభద్రేశ్వరాలయంలో వారు పూజలు నిర్వహించారు. ప్రతియేటా శివమాలాధారులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి పాదయాత్రగా బయల్దేరడడం ఆనవాయితీ. 60 నుంచి వంద మంది వరకు సన్నాపురం, రామదేవ క్యాంపు, బసవేశ్వర క్యాంపు, ఇటిగి, ముద్దటనూరు, కంప్లి, ఇతర గ్రామాలు, పట్టణాల బయల్దేరారు. ఈ సందర్భంగా సమాజ సేవకులు మూకయ్యస్వామి మాట్లాడుతూ మాలధారుల యాత్ర దిగ్విజయంగా పూర్తి కావాలని కోరారు.

విజ్ఞాన వస్తు ప్రదర్శన ప్రారంభం



జ్యోతిని వెలిగిస్తున్న మత గురువు ఖాద్రి

సిరుగుప్ప, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విజ్ఞానంలో దూసుకెళ్లాలని టెక్కలకోట ముస్లిం గురువులు మోహిద్దీన్ ఖాద్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం సిరుగుప్ప పట్టణం బిస్మాల్లా విద్యాసంస్థ ఆధ్వర్యంలో విజ్ఞాన వస్తు ప్రదర్శన, ఆహార వస్తు ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాన్ని మోహిద్దీన్ ఖాద్రి ప్రారంభించి మాట్లాడుతూ నేటి రోజుల్లో వ్యక్తి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. విజ్ఞానంలో ముందడుగు వేసిన నాడే భారత్ ఉన్నత స్థాయికి చేరుకుంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పీరా హుస్సేన్, వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు అబ్దుల్ నబీ, అండే హుస్సేన్ బాషా, మహమ్మద్ నౌషద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

● హెబ్బాళ మఠాధిపతి నాగభూషణ శివాచార్యులు

కంప్లి, ఫిబ్రవరి 22(ఆంధ్ర జ్యోతి) : మహిళను గౌరవించి దేశ సాంప్రదాయాలు కాపాడు కునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని హెబ్బాళ మఠాధిపతి నాగభూషణ శివాచార్యులు తెలిపారు. కంప్లి తాలుకా పరిధిలోని సన్నాపురం గ్రామంలో శుక్రవారం మార్చి9న జరిగే వీరభద్రేశ్వర రథోత్సవం సందర్భంగా శరణ బసవేశ్వర పురాణ పఠనం ప్రారంభం చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు 501 ముత్తయిదువు మహిళలకు ఒడినింపే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగభూషణం శివాచార్యులు మాట్లాడుతూ మహిళలు ఎక్కడ గౌరవిస్తారు. అక్కడ సమృద్ధిగా పంటలు పండి అభివృద్ధి వుంటుందని తెలిపారు. మహిళ అనగానే ఒక శక్తి విశ్వంపైన శక్తి కన్ను గొప్పది మరేదీ లేదన్నారు. ప్రతి యేటా సన్నాపురం గ్రామంలో వీరభద్రేశ్వర రథోత్సవం సందర్భంగా ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు జరపడంతో గ్రామంలో శాంతి నెమ్మదితో అభివృద్ధితో గ్రామం పేరుగాంచిందని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు దేశ సాంప్రదాయాలు సంస్కృతి కార్యక్రమాలు విషయాలపై అవగాహన కల్పించాలి. అలాగే ప్రతి ఇంటర్ పిల్లలకు చదువులు కల్పించి విద్యావంతులు తీర్చిదిద్దాలని తెలిపారు. సన్నాఫ్ అనగానే ప్రతి ఒక్కరికి వీరభద్రేశ్వర గుర్తొస్తారు. ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా ప్రతి ఇంటిలో పూజలతో ఉన్నప్పుడే తమ ఇల్లు ఆనందంతో ముందుకు కొనసాగుతుందని తెలిపారు. అలాగే సోమరి కూడా వదలాలి అన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కినకొప్ప శివశరణు స్వాములు, గూడూరు నీలకంఠతాత, మూకయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

కార్యకర్తలు మనస్పర్థలు వీడాలి: మంత్రి

కంప్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మనస్పర్థలు వదిలి పార్టీ గెలుపుకు, అభివృద్ధికి నాంది పలకాలని కార్మిక శాఖ మంత్రి సంతోష్ తెలిపారు. కంప్లిలో ఆయనను గజమాలలతో అభినందించారు. అనంతరం ఆయనకు అంబేద్కర్ భావ చిత్రపటానికి పూలమాలలతో పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పార్టీలో వుండే కార్యకర్తల మధ్య ఎన్ని మనస్పర్థలు వున్నా పార్టీ గెలుపుకు బూత్‌స్థాయి నుంచి ఏకం కావాలన్నారు. అలాగే గతంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా వున్న సీఆర్ హనుమంతు కాంగ్రెస్ నుంచి బీజేపీ పార్టీలోకి వెళ్లి తిరిగి కాంగ్రెస్ గూటికే చేరడంతో ఆయనను సంతోష్‌లాడ్ అభినందించారు. కాంగ్రెస్ పార్టీలో వున్న సమయంలో సీఆర్ హనుమంతు పార్టీ గెలుపుకు ఎంతో కృషి చేశారని ఆయన తిరిగి రావడం ఎంతో సంతోషించదగిన విషయమన్నారు. అనంతరం అతనిని ఆలింగనం చేసుకున్నారు. అలాగే పురసభ అధ్యక్షులు బట్టప్రసాద్ కూడా అందరికి అనుకూలమైన వ్యక్తి సమస్య ఏదైనా అతని వద్దకు నేరుగా తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. రానున్న జెడ్పీటీసీ ఎన్నికలకు బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలు, అభిమానులు ఐక్యతతో వుండి ప్రతి కాంగ్రెస్ పార్టీ అండగా వుండి గెలిపించాలని కోరారు. వీరితో పాటు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు సుశీలమ్మ, స్థాయి సమితి అధ్యక్షులు ఉస్మాన్, శ్రీనివాసరావు, నారాయణప్ప, జాఫర్, రఘు, జిలాన్, కుమారస్వామి, గిరీష్, సుధీర్, శశి కుమార్, రమేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మంత్రి సంతోష్ లాడ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి శ్రీశైలానికి కేఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈనెల 28 వరకు కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ బళ్లారి డివిజన్ శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డివిజనల్ కంట్రోలర్ ఇనాయత్ బాగ్బన్ తెలిపారు. వివరాలకు బళ్లారి -1వ యూనిట్ 77609 92163, యూనిట్ 2- 7760992164,సిరుగుప్ప 7760992165, కురుగోడు 96064 93671, సండూర్ 776099209 నంబర్లలో మేనేజర్లను సంప్రదించాలని తెలిపారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్యారెంటీలపై గ్రామాల్లో అవగాహన

● ప్రచార రథాన్ని ప్రారంభించిన అథారిటీ అధ్యక్షుడు చిదానందప్ప



వాహనాన్ని ప్రారంభిస్తున్న చిదానందప్ప, వెంకటేశ్‌హెగ్డే

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్యారెంటీ పథకాలు పేదల జీవితాలను మెరుగుపరుస్తాయని గ్యారెంటీ పథకాల అథారిటీ జిల్లా అధ్యక్షుడు చిదానందప్ప అన్నారు. శనివారం నగరంలోని జిల్లా కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో సమాచార, ప్రజా సంబంధాల శాఖ నిర్వహించిన ఎల్ఈడీ వాహనాలు , వీధి నాటకాల ద్వారా హామీ పథకాల ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్దపేదల కోసం గ్యారెంటీ పథకాలను పకద్బందీగా అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు ప్రధాన హామీ పథకాలు రాష్ట్రంలో 98శాతం విజయవంతంగా అమలు అవుతున్నా యన్నారు. వంద శాతం అమలుకు ప్రాజెక్టుల అవగాహన చాలా అవసరమన్నారు. ఎల్ఈడీ వాహనం, వీధి నాటకాల ద్వారా జిల్లాలోని 20ఎంపిక చేసిన గ్రామాల్లో వాహనాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. పథకాల్లో ఎటువంటి మధ్యవర్తులు లేకుండా ప్రజలకే అందేలా చూడాలన్నారు. గత 16నెలలుగా గృహలక్ష్మి యోజన యొక్క అన్ని వాయిదాలు గృహలక్ష్మి అబ్దిదారుల ఖాతాల్లో జమచేయబడ్డాయి. కొన్ని సాంకేతిక కారణాల వల్ల గత 3నెలలుగా ఇంటి ఆదాయం అందలేదు, రాబోయే రోజుల్లో చెల్లింపు గురించి ముఖ్యమంత్రి,శాఖా మంత్రి ఇప్పటికే తెలియజేశారన్నారు. అదే విధంగా అన్నభాగ్య పథకం కింద 5కిలోల బియ్యానికి బదులుగా ఇచ్చిన డబ్బును జమ చేయలేదు,హామీ ఇచ్చినట్లు వచ్చే నెలలో అర్హులైన రేషన్ అబ్దిదారులందరికి బకాయి మొత్తాన్ని చెల్లించడంతోపాటు 10కిలోల బియ్యం పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ పథకాలను అర్హత కలిగిన లబ్దిదారులకు అందజేసేందుకు కట్టుబడి ఉందని, ఆలస్యమైనా అందరికీ అందేలా చూస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు వెంకటేశ్ హెగ్డే, లింగరాజ్, సమాచార ప్రజా సంబంధాల శాఖ గురురాజు, సిబ్బంది సభ్యుడు హనుమేశ్, కళాకారులు హులుగప్ప, సుంకప్ప, హేమంత్,ఎర్రిస్వామి, హనుమయ్య తిమ్మలాపురం తదితరులు పాల్గొన్నారు.

మహాసముద్రాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సముద్రాలపై అవగాహన కల్పించారు. విదేశాలతో వస్తువుల వ్యాపారం, మార్పిడి ఎక్కువగా సముద్ర రవాణా ద్వారా జరుగుతుందని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రపంచంలోని ఐదు మహాసముద్రాల పరిచయం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బియ్యం, గోధుమలు, ముడిపత్తి, నూనె గింజలు, ఇనుప ఖనిజం, ఇంధన నూనె, ఇనుము, మొక్కజొన్న,మోటారు వాహన విడిబాగాలు మొదలైన వాటి మార్పిడి సముద్ర రవాణా ద్వారా జరుగుతుంది. స్వాతంత్ర్యానికి ముందు నుంచి ఇంగ్లాండ్, ఫ్రాన్స్, పోర్చుగీస్, డచ్, గ్రీకు దేశాల వంటి యూరోపియన్ దేశాల మధ్య వస్తువులు ,సేవల మార్పిడి సముద్ర రవాణా ద్వారా జరుగుతోందన్నారు. భారతదేశానికి సముద్రయానం సులువుగా ఉన్నందువల్ల విదేశీయులు సులువుగా ప్రవేశించారన్నారు. విద్యార్థులు మహాసముద్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తదుపరి సోషల్ టీచర్ శాశమ్మ మహాసముద్రాల గురించి మాట్లాడరు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు దిల్షాద్ బేగం, చన్నమ్మ, సుమతి,వైశాలి, శ్వేత, ఉమ్మెహాని, రామాంజనేయ,గురుప్రసాద్,విజయ ముండ్రగి, విద్యార్థి ప్రతినిధి అనూష తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఫర్నిచర్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

హోసూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆవలపల్లి రోడ్డులోని ఓ ప్రైవేట్ పాఠశాల సమీపాన హోసూరు మీనాక్షినగర్‌లోని ధనశేఖర్‌కు చెందిన ఫర్నిచర్ ల్యాండ్ అనే ఫర్నిచర్ తయారీ ఫ్యాక్టరీ ఉంది. కార్మికులు మధ్యాహ్నం భోజనానికి బయటకు వెళ్లి వాపసు రాగా ఒక్కసారిగా మంటలు చెలరేగడాన్ని గుర్తించారు. వెంటనే ధనశేఖర్‌కు సమాచారం తెలిపారు. అగ్నిమాపక కేంద్రానికి కూడా సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే ఫ్యాక్టరీలో ఉండే వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. పనులకు ఉపయోగించే కలప యంత్రంతో పాటు అన్ని వస్తువులు మంటల్లో కాలిపోయాయి. మంటల కారణంగాఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది. అగ్నిమాపక సిబ్బంది గంటకు పైగా శ్రమించి పైగా మంటలను నియంత్రించారు.



కాలిపోతున్న సామగ్రి

రాష్ట్రంలో పరిశ్రమలకు ప్రోత్సాహం: మంత్రి రాజా

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు, పెట్టుబడులను పెట్టేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా పేర్కొన్నారు. కృష్ణగిరి జిల్లా శూలగిరి సిప్‌కాట్ ఇండస్ట్రియల్ పార్క్, డాన్‌ఫోర్రా పార్క్, కురుబరపల్లి, డెల్టా కంపెనీ పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. జిల్లాలోని పరిశ్రమలను శనివారం పరిశీలించారు. తమిళనాడు ఇండస్ట్రీ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ అదనపు ముఖ్య కార్యదర్శి, మేనేజింగ్ డైరెక్టర్ సాయికుమార్, సెందిల్ రాజు, జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, సిప్‌కాట్ మేనేజింగ్ డైరెక్టర్ టి.స్నేహ, కృష్ణగిరి జిల్లా ఎంపీ కె.గోపినాథ్, హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, తళి ఎమ్మెల్యే టి.రామచంద్రన్, మతియళగన్‌లు పరిశీలించారు. మంత్రి టీఆర్‌బీ రాజా మాట్లాడుతూ స్టాలిన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి క్షీణిస్తున్న పారిశ్రామిక పెట్టుబడి రంగాన్ని ఉద్ధరించడానికి అనేక చర్యలు తీసుకున్నారన్నారు. భారతదేశపు నంబర్ వన్ ముఖ్యమంత్రి అని, భారతదేశంలో వ్యాపారం ప్రారంభించడానికి ఎవరు వచ్చినా, తమిళనాడు సీఎం కార్యాలయం తలుపు తడతారన్నారు. తమిళనాడులో ఎవరైనా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకుంటే వెంటనే వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల నుంచి అందరూ పారిశ్రామిక పెట్టుబడిదారులతో సమన్వయంగా పని చేస్తున్నారన్నారు. 1970 దశకంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ కరుణానిధి నాటిన విత్తనం ప్రస్తుతం పెద్ద వృక్షంగా మారిందన్నారు. తమిళనాడు రాష్ట్రం ఆసియాలోనే అభివృద్ధి చెందిన ఏకైక రాష్ట్రం, తమిళనాడులో మాత్రమే తప్పనిసరి ఒకేబాటలో నడుస్తామని ప్రసంగించారు. హోసూరు సమీపంలోని అముద గొండపల్లి, టాన్‌ఫోర్రా పార్కులో గులాబీ మొక్కల పెంపకం పనులకు రూ.1 కోటితో నూతనంగా నిర్మిస్తున్న సాంకేతిక నైపుణ్య శిక్షణా కేంద్రం నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి పళనిదేవి, సిప్‌కాట్ ప్రాజెక్టు అధికారులు రేణుకాదేవి, సింధు, ఉమాశంకరీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పశుపతి, సిప్‌కాట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు పవిత్ర, సూపరింటెండెంట్ ఇంజనీర్ సామ్యూల్, దేవైరీగం, అబ్దుల్ రషీద్, మురుగన్, ప్రతినిధులు పాల్గొన్నారు.



కంపెనీ నమూనాను పరిశీలిస్తున్న మంత్రి రాజా

గుర్తింపు కార్డుల పంపిణీ

హోసూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంత అసోసియేషన్ కార్యాలయంలో అమైపుసార సంఘ ఆధ్వర్యంలో కార్మికుల పిల్లలకు వైద్యం, విద్యకు రూ.50 వేలు, ఇంజనీరింగ్ విద్యకు సహాయం, మహిళా ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. తమిళనాడు ప్రభుత్వ కార్మిక సంక్షేమ రాష్ట్ర సలహా కమిటీ మాజీ సభ్యుడు, తమిళనాడు నాన్ ఆర్గనైజర్ మాన్యువల్ లేబర్స్ స్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇళంచెళియన్ నేతృత్వంలో హోసూరు నియోజకవర్గానికి చెందిన అమైపు సారా సంఘ కార్మికుల పిల్లలకు వైద్యం, విద్య అవసరాలకు చేయూత అందించేలా గుర్తింపు కార్డును అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉప కార్యదర్శి మదన్, లిటరరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు గుణశేఖరన్, న్యాయవాదుల విభాగం జిల్లా కార్యదర్శి న్యాయవాది నంజేగౌడ పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు గుర్తింపుకార్డులు అందజేస్తున్న కార్మికసంఘం నాయకులు

అధ్వానంగా మారిన రోడ్లు

హోసూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో భూగర్భ మురుగునీటి పారుదల ప్రాజెక్టు (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) నిర్మాణాల కారణంగా రోడ్లను సక్రమంగా మూసివేయకపోవడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారు. శనివారం ఆటో ముందు టైయర్ మట్టిలో కూరుకుపోవడంతో ఆటోలోని మూడేళ్ల చిన్నారి ముక్కు దెబ్బతింది. వెంటనే చిన్నారిని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు అందించారు. హోసూరులో రూ.580 కోట్ల అంచనా వ్యయంతో భూగర్భ మురుగునీటి పారుదల ప్రాజెక్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మూడు నెలలక్రితం మంత్రి నెహ్రూ భూమి పూజ చేసి ప్రారంభించిన సంగతి విదితమే. ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి మరికొన్ని నెలలు పడుతుంది. హోసూరు ఆరో వార్డు పరిధిలోని ఎంజీజీఓస్ కాలనీ నగర్ ప్రాంతంలో ఇరుకైన రోడ్లపై భూగర్భ మురుగునీటి పారుదల ప్రాజెక్టు కోసం గుంతలు తవ్వి పైపులు అమర్చారు. అయితే రోడ్డును సక్రమంగా మూసివేయకుండా మట్టి వేసి వదిలేశారు. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



గుంతలో దిగబడిపోయిన ఆటో